అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 08 ఫిబ్రవరి 2023

కొనుగోలు కేంద్రం కోసం నేడు శనగ రైతుల ధర్నా

నవతెలంగాణ-మద్నూర్

శనగ పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో నేడు(బుధవారం) తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేయనున్నట్టు భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షులు చాట్ల గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని మల్లేశ్వర్ మందిరానికి రైతులు తరలిరావాలని, ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. శనగతో పాటు కంది, ధనియా పంటకు మద్దతు ధర కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయనున్నట్టు తెలిపారు. కావున రైతులందరూ పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గడువు పొడగింపు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్స్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఫిబ్రవరి 11వరకు పొడిగించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధిక సూచించారు. 2023-2024 విద్యాసంవత్సరానికి ఈ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి దరఖాస్తు గడువు ఫిబ్రవరి 5తో ముగిసింది. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఇటు కుక్కలు.. అటు కోతులు


కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో కుక్కల మంద

- గ్రామాల్లో గుంపులుగా సంచారం
- గ్రామస్తుల వెంట పడుతూ భయాందోళనకు గురి చేస్తున్న వైనం
- పంటలతో పాటు పశువులపై, జీవాలపై దాడులు
- తరలించాలని విన్నవిస్తున్నా పట్టని ఉన్నతాధికారులు


జుక్కల్ మండలం కౌలాస్ గ్రామంలో గుంపులుగా సంచరిస్తున్న కోతులు


కౌలాస్ గ్రామంలో కూనెలు తీయకుండా ఇంటిపై ముండ్ల కంప

నవతెలంగాణ-జుక్కల్/కమ్మర్‌పల్లి

గ్రామాల్లో ఒక వైపు కుక్కలు, మరో వైపు కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ఒంటరిగా వెళ్తున్న వారి వెంట బడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దాడులకు తెగబడుతున్నాయి. దీంతో వీటి తీరుతో కనీసంగా రోజుకొకరు గాయాలపాలవుతున్నారు. కుక్కలు మందలుగా ఉంటూ అటుగా వెళ్తున్న వారి వెంట పడుతున్నాయి. దీంతో పాటు గొర్రెలు, మేకలు, దూడెలపై దాడులకు తెగబడుతున్నాయి. కోతులు గుంపులుగా తిరుగుతూ పంటలను నాశనం చేస్తూ ఇల్లు పీకి పందిరేస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామాన్ని కదలించినా ఇలాంటి గాథలే వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వీటిని గ్రామాల నుంచి తరలించి దూర ప్రాంతాల్లో విడిచిపెట్టి రావాలని, వాటికి కు.ని ఆపరేషన్‌లు చేసి వాటి సంఖ్య పెరగకుండా చూడాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానికులు కోరుతున్నారు.

కోతులతో.. కంటిమీద కునుకు లేదు

జుక్కల్ : మండలంలోని కౌలాస్ గ్రామంలో కోతుల బెడద.. గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పక్కనే కౌలాస్ కోట, దట్టమైన అడవి ప్రాంతం ఉండటంతో నిత్యం గ్రామంలోకి వందల సంఖ్యలో చొరబడి గ్రామస్తుల ఇండ్ల పైకప్పులు ధ్వంసం చేయడమే కాకా, ఇండ్లలోకి చొరబడి వండిన వంటలను చిందరవందరగా పడేస్తున్నాయి. వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే కోతులు మూకుమ్మడిగా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఓ వ్యక్తిని గాయపర్చాయి. వాహనదారులను వెంబడిస్తున్నాయి. శుభకార్యాలు చేస్తే వంటసామాగ్రి అపహరిస్తున్నాయి. కూనెపెంకులు ఉన్న చోట ఇల్లు పీకి పందిరివేస్తున్నాయి. దీంతో ముళ్లకంపలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంటలను కూడా నష్టం చేస్తూ రైతులకు పంటనష్టం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. సోమవారం సైతం గ్రామంలోని పోచమ్మ గుడి పెద్దరోడ్డుకు గుంపులుగా ప్రవేశించి విధ్వంసం సృష్టించాయి. దీంతో గ్రామస్తులు భయపడి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. హరిత హారంలో కోతుల ఆహారం కోసం కోతుల వనం ఏర్పాటు చేసి లక్షలు వెచ్చించినా లక్ష్యం నెరవేరకపోగా.. కోతులు వాపస్ పోకుండా మరింత ఎక్కువగా గ్రామాల్లోకి వస్తున్నా యని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా కానీ అటవీశాఖాధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని, కోతులను పట్టుకొని దూర ప్రాంతంలో విడిచిపెట్టి రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి

నందిపేట్ : నందిపేట్ మండలం చౌడమ్మ కొండూరు గ్రామ శివారులో పాత ఊరు ఎల్లమ్మ చెరువు ప్రాంతంలో మంగళవారం కుక్కలు కృష్ణ జింకను వేటాడి చంపేశాయి. స్థానికులు సర్పంచ్ ద్వారా ఫారెస్ట్ అధికారులకు సమాచారాన్ని అందించారు. ఫారెస్ట్ అధికారి సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని వెటర్నరీ డాక్టర్ తో పోస్టుమార్టం చేయించి కృష్ణ జింకను ఖననం చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి హనుమత్ రెడ్డి మాట్లాడుతూ... జింక వయసు దాదాపు 3 సంవత్సరాలు అని, గర్భవతి జింక అని, కుక్కల గుంపు వేటాడడంతో అధిక దూరం పరిగెత్తి కుక్కలకు దొరికిపోయినట్టుందని తెలిపారు. దాని గర్భంలో మూడు నెలల వయసున్న పిల్ల కూడా ఉందని తెలిపారు.


కుక్కకు పోస్టుమార్టం

రోజుకో కుక్క కాటు బాధితుడు

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్‌లో వందల సంఖ్యలో ఉన్న కుక్కలతో ప్రతిరోజు ఎవరో ఒకరు కుక్కకాటు గురవుతున్నారు. సుమారు 400-500 కుక్కలు గ్రామంలో గుంపులుగా సంచరిస్తున్నాయి. గ్రామంలోన విధి విధినా తిరుగుతూ మనుషులపై, మేకలపై, గొర్రెలపై దాడి చేస్తున్నాయి. కుక్కల మూలంగా ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు గాయపడుతూనే ఉన్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలంటూ ప్రజలు గ్రామ పంచాయతీకి విన్నవిస్తున్నారు. ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకొని కుక్కలను చంపడానికి ఉన్నతాధికారులు అనుమతించాలని సర్పంచ్ కోరుతున్నారు. ప్రజలు కుక్కల దాడుల వల్ల ఆస్పత్రి పాలవుతున్నందున ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరుతున్నాడు.

కుక్కలను చంపేందుకు అనుమతించండి

అశోక్. బషీరాబాద్ సర్పంచ్, కమ్మర్‌పల్లి

గ్రామంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ గ్రామస్తులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామంలో ఎక్కడో ఓ చోటు ప్రతిరోజూ ఎవరో ఒకరు కుక్కల దాడికి గురవుతున్నారు. మనుషులపై, గొర్రెలు, మేకలపై దాడులు చేస్తున్నాయి. ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకొని కుక్కలను ఇక్కడి నుంచి తరలించే ఏర్పాటైనా చేయండి.. లేదా వాటిని చంపడానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నా. కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 12న పదో తరగతి ప్రతిభా పరీక్షలు

జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధక్షులు ముదాం అరుణ్‌కుమార్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈనెల 12న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని, కావున విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5వేల ప్రైజ్‌మనీ, రెండో, మూడో విజేతలకు రూ.2500 రూపాయలు ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్టు తెలిపారు. అదే విధంగా మొదటి పది ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు ఉంటాయని ఆసక్తి గల విద్యార్థులందరూ పాల్గొనాలని అన్నారు. ఈ పరీక్ష కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సాందీపని జూనియర్ కళాశాల, శ్రీ ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో ఉంటుందని తెలిపారు. వివరాలకు 9949054929, 8790391518 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, నాయకులు అవినాష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు

ఆస్తి అమ్మేందుకు అడ్డువస్తుందని ఘాతుకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మానవత్వాలు మంటగలుస్తున్నాయి. కనిపెంచిన తల్లి అని కూడా చూడకుండా.. ఆస్తిని అమ్మేందుకు అడ్డువస్తుందని కర్కశత్వం ప్రదర్శించి హత్య చేశాడో కొడుకు. ఈ ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసన్ పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం గండి మాసానిపేట్ కు చెందిన లచ్చమ్మళ్ళ పోచమ్మ (50) కొడుకు సంజీవులుకు అప్పులు అవడంతో భూమి విక్రయించి అప్పులు తీర్చుదామని అడగగా.. తల్లి ఒప్పుకోలేదు. దీంతో భూమి అమ్మేందుకు తల్లి అడ్డుగా వస్తుందని భావించిన ఆయన.. సోమవారం రాత్రి ఇంట్లో వాళ్లందరూ గాడ నిద్రలో ఉండగా తల్లి గొంతు నులిమి హత్య చేశాడు. కుటుంబ సభ్యులు ఉదయం లేవడం లేదని వెళ్లి చూడగా మృతి చెందిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కొడుకుని విచారించగా నేరం చేసినట్టు ఒప్పుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలి

- రైతు విన్నూత నిరసన

నవతెలంగాణ-ముప్కాల్


రైతును సముదాయిస్తున్న పోలీసులు

ఇష్టాను సారంగా కరెంట్ సరఫరా చేయడంలో పంట పొలాలు ఎండిపోతున్నాయని, నాణ్యమైన త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన లోక రాములు అనే రైతు 44వ జాతీయ రహదారిపై అర్ధనగ్న ప్రదర్శనతో విన్నూత నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతు చేస్తున్న నిరసనను సద్దుమణిగించారు. అనంతరం రైతులు ఆర్మూర్ విద్యుత్ అధికారి డీఈకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు లోక రాములు, మల్లారెడ్డి, ఏలేటి రాములు, ముత్యం రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీకి, ఓబీసీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ ఓబీసి జిల్లా అధ్యక్షులు, యానంపల్లి మాజీ సర్పంచ్ యం శ్రీనివాస్ గౌడ్ తన పదవికి, బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఇంత కాలం తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

11న జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-బోధన్

ఈనెల 11వ తేదీన శనివారం బోధన్ కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోకదాలత్ నిర్వహించనున్నట్టు బోధన్ మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్అదాలత్ సందర్భంగా కేసుల పరిష్కారానికి న్యాయస్థానంలోని మూడు బెంచీలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ లోక్అదాలత్ కొనసాగుతుందని కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్



ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైని కొండల్‌రెడ్డి (43) తన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఉదయం వరికి నీరు పెట్టేందుకు బోరు మోటర్ వద్ద స్టార్టర్ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్ తగిలింది. గమనించిన అతని సోదరుడు బాపురెడ్డి కొండల్‌రెడ్డి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు ఉపయోగకర బడ్జెట్ తేవాలి

- రేపు చలో హైదరాబాద్ : వ్యకాస

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న పెద్ది వెంకట్‌రాములు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను విస్మరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టుగా ఉంది. అందుకని ప్రస్తుత బడ్జెట్లో మార్పులు చేసి ప్రజలకు ఉపయోగకరమైన బడ్జెట్ తేవాలని' తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు ఏశాల గంగాధర్ - పెద్ది వెంకట్రాములు మాట్లాడారు.

ఉపాధి హామీ రంగానికి 2 లక్షల 40 వేల కోట్ల కేటాయించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టన బడ్జెట్లో వ్యవసాయ కూలీలని పూర్తిగా మర్చిపోయారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు బాగా పెరిగినయని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్.. ఆ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వ్యవసాయ కూలీలని మర్చి పోయారు అని గుర్తు చేశారు. వ్యవసాయ కూలీల సంక్షేమం, వారి నివాస స్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకోచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు, రైతాంగ సమస్యల పరి ష్కారం కోసం ఈ నెల 9న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కావున కార్మికులు, రైతులు, జిల్లా ప్రజానీకం పెద్దఎత్తున హాజరై ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నర్రా శంకర్, సహకార దర్శి గుండ్ల లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు గోశం లక్ష్మి, కదం రాజు లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్ఏ ఆత్మహత్య



నవతెలంగాణ-దోమకొండ

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తీవ్ర మనస్తాపానికి గురై ఓ వీఆర్ఏ చెరువులోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అంచనూరు గ్రామంలో మంగళవారం వెలుగుజూసింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంచనూరు గ్రామానికి చెందిన మన్నే దేవరాజ్ (35) అంచనూరు గ్రామ వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. వచ్చే వేతనం సరిపోక.. కుటుంబ పోషణకు అప్పుల పాలైయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య ఆత్మహత్యకు పాల్పడ్డట్టు మృతుడి భార్య మన్నె భాగ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ వృద్ధాశ్రమంలో అదనపు భవనం ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవం చేపడుతున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్సీ, కలెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని రాంపూర్ డి గ్రామంలో అన్ని హంగులతో 50 లక్షల రూపాయల నిధులను వెచ్చించి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వృద్ధాశ్రమం భవనానికి మంగళవారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, శాసన మండలి సభ్యులు వి.గంగాధర్ గౌడ్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు మంగళవారం ప్రారంభిం చారు. వృద్ధాశ్రమం ఆవరణలో ఐదు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. వృద్ధాశ్రమంలోని వివిధ విభాగాలను సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అంతకు ముందు డిచ్ పల్లి మండలంలోని ధర్మారం బీ, యానంపల్లి తండాలో కంటి వెలుగు శిబిరంను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఘన్ పూర్ గ్రామంలో మన ఊరు మన బడి లో జరుగుతున్న పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. వీరి వెంట జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిరా లక్ష్మి నర్సయ్య, డిఎంహెచ్ ఓ డాక్టర్ సుదర్శనం, సర్పంచ్ పాపాయి తిరుపతి,సర్పంచ్ పత్తి మమత ఆనంద్, ఉప సర్పంచ్ యెంకనోల్ల రమేష్,సోసైటి చైర్మన్ తరచంద్ నాయక్, డీడబ్ల్యూఓ సుధారాణి, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపిడిఓ గోపి బాబు,సర్పంచ్ లంబాని నీల ఉన్నారు.

ముగిసిన జానకంపేట్ లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట శివారులో గల శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ జాతర బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గత వారం రోజులుగా కొనసాగిన జాతర బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరైన విషయం తెలిసిందే.

హుండీ లెక్కింపు..

శ్రీ లక్ష్మినరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులు వేసిన కానుకల హుండీని దేవాలయ ధర్మదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.1,01,778 ఆదాయం వచ్చినట్టు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వేణు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పురం సాయిలు తెలిపారు. జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు వేసిన హుండీ ఆదాయం రూ.62,152 వచ్చినట్టు వారు పేర్కొన్నారు.

బాలికలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-ముప్కాల్



బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు మంగళవారం వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. గెలుపొందిన బాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, ఉపాధ్యాయులు, అంగన్ వాడి టీచర్లు అమినా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు..

నవతెలంగాణ

నిజామాబాద్

2

బుధవారం 08 ఫిబ్రవరి 2023

నేతన్నల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరం

నవతెలంగాణ కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో నేతన్నల సంక్షేమానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం బాధాకరమని జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ కోశాధికారి సిలివేరి గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అసెంబ్లీలో ఆర్థిక మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నేతన్నలు ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తున్నారని నేతన్నల మనసును దోచాలని చూశారు తప్ప నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. బడ్జెట్ ను నేతన్నలు అర్థం చేసుకోకుండా ఉంటారని ప్రభుత్వం భ్రమ పడటం తప్పు అని పేర్కొన్నారు. ఎత్తం చేనేత రంగానికి చేయూతనిచ్చి కాపాడాలని డిమాండ్ చేశారు.

మోసగాళ్ల ఉచ్చులో పడొద్దు

- నయా పైసా ఇవ్వకుండ మాట్లాడటం హేయం : ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్
- రాంపూర్ గ్రామానికి రూ.7,56 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి, ఎమ్మెల్సీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి ఇవ్వకుండా, ఎలాంటి పనులు చేయకుండా గ్రామాలకు వచ్చే వారిని నిలదీయాలని, ప్రజలు, యువత అలాంటి మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని, ఒక్క గ్రామంలో 7కోట్ల 56లక్షల రూపాయలు మంజూరు చేసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన లు చేశామని, ఇదిగో మేము చేసిన అభివృద్ధి మీ కంటికి కనపడదా.. అని, గ్రామాలకు నయా పైసా ఇవ్వకుండ మాట్లాడటం హేయమని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.మంగళవారం డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ (డీ) గ్రామంలో 7 కోట్ల 56 లక్షల రూపాయలతో నిర్మించిన చెక్ డ్యాం, పశు మెటాలిటీ హస్పిటల్, వృద్ధాశ్రమం భవనం, పశువైద్యశాల భవనం, శ్మశానవాటిక, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాలు భవనాలు, సిసి రోడ్, డ్రైనేజ్, కుల సంఘ భవనాలు, సహకార సొసైటీలో వ్యాపార దుకాణాల సముదాయం, పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తం అప్పుల మయంగా మార్చిందే తప్ప ఏ ఒక్క గ్రామానికి అయినా రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎంపికి సంవత్సరానికి 5 కోట్ల రూపాయలు ఎంపి ఫండ్ ఉంటుందని ఒక గ్రామానికి రూపాయి ఇచ్చింది లేదని అన్నారు. దేశ సంపదలను, ప్రభుత్వ సంస్థలు ఆదాని అంబానికి అమ్ముతూ దేశాన్ని అప్పుల మయంగా మారుస్తున్న ఘనత ప్రధాని మోడీ కి చెందుతుందని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ పుట్టిన గ్రామానికి ఎంత చేసిన తక్కువేనని, గ్రామంలో ఒక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలనే కోరిక ఉందన్నారు. ఇదే కాకుండా రహదారుల నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్, సర్పంచ్ పాపాయి తిరుపతి, తెలు గణేష్, నడ్పన్న, లోలం సత్యనారాయణ, ఉపసర్పంచులు ఎంపిటిసిలు, యువజన సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేపట్టిన ఉద్యోగులు

వేతన సవరణ అమలు చేయాలి

- బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈవీల్ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

గుర్తింపు సంఘాలతో మూడోవేతన సవరణ ఒప్పందం మీద మేనేజ్మెంట్ సంతకం చేసి వెంటనే వేతన సవరణ అమలు చేయాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈవిల్ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జాయింట్ ఫోరమ్ ఆఫ్ బిఎస్ఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు మధ్యాహ్న భోజనం సమయంలో సంచార్ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల కోసం కొత్త ప్రమోషన్ పాలసీ మీద గుర్తింపు సంఘాలు చేసిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే క్రొత్త ప్రమోషన్ పాలసీని అమలు చేయాలన్నారు. ఏ రకమైన అడ్డంకులు లేకుండా బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సర్వీసులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రిటైర్, వీఆర్ఎస్ ఉద్యోగులు,. బీఎస్ఎన్ఎల్ ఈ యు నాయకులు మస్తాన్ అలీ, సాయిలు కేశవరావు అనురాధ, కృష్ణ, గంగాధర్, అక్బర్, రెహమాన్, రమేష్, సాయిలు, తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

9, 10న సుకన్య సమృద్ధి యోజన మేళా

నవతెలంగాణ-డిచ్ పల్లి

బాలికల బంగారు భవిష్యతు కోసం ఈ నెల 9 ,10 వ తేదీల్లో సుకన్య ఖాతాలు తెరిపించాడనికి అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రత్యేక మేళ నిర్వహిస్తున్నామని నిజామాబాద్ సౌత్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ మంగళవారం తెలిపారు. 10 సంవత్సరాల లోపు ఉన్న బాలికల పేరుపై 250 రూపాయలతో సుకన్య సమృద్ధి ఖాతా ప్రారంభించవచ్చని అయన తెలిపారు. సుకన్య సమృద్ధి ఖాతాపై అత్యధిక వడ్డీ 7.6శాతం చక్ర వడ్డీ లభిస్తుందని అన్నారు. ఉదాహరణకు నెల నెల వెయ్యి రూపాయల చొప్పున 15 సంవత్సరాలు కడితే 21 సంవత్సరాల తర్వాత ప్రస్తుతం ఉన్న వడ్డీ ప్రకారం రు. 5,10,373 లభిస్తాయని సంతోష్ వివరించారు. ఒక ఆర్థిక సంవత్సరంలో 250 రూపాయల నుంచి లక్షా 50 వేల రూపాయల వరకు ఎంతైనా జమ చేసుకోవచ్చని తెలిపారు.10 సంవత్సరాలలోపు ఉన్న బాలికల తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంతోష్ కుమార్ ప్రజలను కోరారు.

పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించిన జాన్కంపేట యువకుడు



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన జంగం లక్ష్మణ్, సుగుణ దంపతుల పెద్ద కుమారుడు విక్రాంత్ పట్టుదలతో చదివి రేడియో గ్రాఫర్‌గా ఉద్యోగం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 పోస్టులకు 2018 ఫిబ్రవరిలో పరీక్ష రాశారు. హైదరాబాదులోని నీలోఫర్ జనరల్ ఆస్పత్రిలో రేడియో గ్రాఫర్‌గా నియమితులయ్యారు. ప్రభుత్వ బోధనాస్పత్రిలో ప్రజారోగ్య విభాగంలో టీఎస్ పీఎస్ ద్వారా నియామకమైన విక్రాంత్ రెండో తమ్ముడు వివేక్ అబ్కారి ఎస్సైగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉద్యోగం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన విక్రాంత్ ఉద్యోగం పొందడం పట్ల గ్రామ సర్పంచ్ సొడ పుష్పలత, ఉపసర్పంచ్ రమేష్, ఎల్ ఎఫ్ ఎల్ ప్రార్థన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్, వీడిసి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

టీఎన్జీవో డివిజన్ అధ్యక్షునికి సన్మానం



డివిజన్ అధ్యక్షులు, పాలకవర్గాన్ని సన్మానిస్తున్న టీఎన్‌జీవోలు

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మండల సర్వేయర్ శిఖారి రాజు వారి పాలక వర్గ సభ్యులను, వారి నియామకానికి కృషి చేసిన జిల్లా సంఘం అధ్యక్షుడు ఆలుక కిషన్ ను మంగళవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ పస్క నర్సయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన షిఖారి రాజు తన ఉద్యోగ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ప్రజలకు మెరుగైన పరిపాలన అందడానికి ఉద్యోగులకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా ఉండి ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన వెళ్ళేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో మండల నాయకులు దేగాం శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ టీసీ సాయన్న, ఎస్సి సెల్ అధ్యక్షుడు ప్రభుదాస్, టీఎన్‌జీఓ నాయకులు, డివిజన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో మూడు కోట్లు కేటాయించడం దుర్మార్గం



మాట్లాడుతున్న ఇడగొట్టి సాయిలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో కేవలం మూడు కోట్ల రూపాయలు కేటాయించడం దుర్మార్గమని, ఇంటికో ఈక ఉరికో కోడి అనే చందంగా ఉందని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు విమర్శించారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 48 లక్షల మంది వడ్డెర వృత్తిదారుల జనాభా ఉంటే కేవలం మూడు కోట్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. గత సంవత్సరం కేవలం మూడు కోట్లు కేటాయించి ఇప్పటికీ విడుదల చేయలేదన్నారుజ కనీసం వడ్డెర వృత్తిదారులకు లోన్లు మంజూరు చేయలేదన్నారు. ఈ రాష్ట్రంలో సుమారుగా 4000 సొసైటీలు ఉన్న ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వడ్డెర వృత్తిదారులను గుర్తించి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. బడ్జెట్లో సుమారుగా 3వేల కోట్లు కేటాయించి వడ్డెర వృత్తిదారులకు వడ్డెర బందును ప్రకటించి 10 లక్షలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. వృత్తిచేస్తూ చనిపోయిన వారికి కనీసం ఎక్స్గ్రేషియా కూడా చెల్లించలేని దీని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యారంగుల కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 50 నుండి 60 వేల వడ్డెర జనాభా ఉన్నారని తెలిపారు. ఇందులో 200 సొసైటీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని, ఈ సొసైటీలకు 30 లక్షల రుణం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. వెంటనే రుణాలు ఇవ్వాలని అనారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇడగొట్టి చిన్న ఒడ్డన్న, జిల్లా కమిటీ సభ్యులు గుంజ పాపన్న, బత్తుల ఒడ్డన్న, గోగుల ఎల్లయ్య , గోగుల ఎర్ర సాయిలు, కంది ఎల్లయ్య, కంది సాయిలు పాల్గొన్నారు.

పీఎం కేవైసీపై అవగాహన

నవతెలంగాణ-(వేల్పూరు) ఆర్మూర్

మండలము వ్యవసాయ శాఖ పోస్టల్ శాఖ సంయుక్తంగా పీఎం కిసాన్ పథకం ద్వారా 6000 రూపాయలు 3 వాయిదాలలో రైతులకి అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య మంగళవారం తెలిపారు. ఎన్పీసీఐ ద్వారా ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ కి అనుసంధానం లేని రైతులు ఈ కేవైసీ లేని రైతులకి నమోదు చేశామని తెలిపారు. ఏ ఈ ఓ లు. ఆధార్ కార్డు అనుసంధానం లేని రైతులను సంప్రదిస్తున్నారని అన్నారు. ఆ రైతులు తమ బ్యాంక్ అకౌంట్ ఉన్న బ్రాంచ్‌ని సంప్రదించి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ పీఏ యువన్ కుమార్, ఏఈఓ షబ్బీర్, బీపీఎం శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కోటి రూపాయల ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మాదాపూర్ గన్యాతాండ గ్రామాలకు రెండు దేవాలయాల నిర్మాణం కోసం కోటి రూపాయల ప్రొసీడింగ్ కాపీని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అందజేసినట్లు పుప్పాలపల్లి ఎంపీటీసీ అంకం లక్ష్మీ ప్రకాష్ మంగళవారం తెలిపారు. మాదాపూర్ గ్రామంలోని పెద్దమ్మ టెంపుల్ కొరకు 50 లక్షలు నూర్ సింగ్ తండాలోని సేవాలాల్ దేవాలయ నిర్మాణంకోసం 50 లక్షలు కాపీను అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిటిసి అంకం లక్ష్మీ ప్రకాష్ మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సహకరించిన ఎంపిపి కుంచాల విమల రాజు, జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాదాపూర్ సర్పంచ్ లింగన్న, గన్య తండా సర్పంచి నూర్సింగ్, దేవాలయ కమిటీ సభ్యులు, సేవాలాల్ దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘీక సంక్షేమ కళాశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, జిఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుమల డెంటల్ కళాశాల తరపున ఉచిత దంత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థినిలు అధ్యాపక బృందం, అధ్యాపకేతరులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో జి ఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు నరేష్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ కె. లావణ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి యం.సరిత, మెంబర్స్ మమత సునీత రజిత హెచ్ ఎస్ ఎస్ మాధురి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

నిజామాబాద్ దంపతులకు అరుదైన గౌరవం

నవతెలంగాణ-కంఠేశ్వర్



సర్టిఫికెట్లు అందుకుంటున్న దంపతులు

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంస్థలో వివిధ హోదాల్లో పనిచేస్తూ లీడర్షిప్ ఇతర శిక్షణల్లో విజయ వంతంగా పాల్గొన్న నిజామాబాద్ నగరానికి చెందిన దంపతులకు అరుదైన గౌరవం దక్కింది. జేసిఐ ఇందూర్ అధ్యక్షులుగా 2014లో పనిచేసిన జిల్కర్ విజయానంద్, 2017 లో అధ్యక్షురాలిగా పనిచేసిన జిల్కర్ లావణ్యలకు ప్రతిష్టాత్మకమైన ఎస్ఎంఎ గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్లు దక్కాయి. జేసిఐ ఇండియా సీనియర్ మెంబర్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ ప్రమోద్ కుమార్ హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్ఎంఎ అడ్వయిజర్ సునీల్ కుమార్ 2022 చైర్మన్ వినయ్ మెహతా పాల్గొన్నారు. అదే విధంగా జేసిఐ ఇండియా సీనియర్ మెంబర్స్ అసోసియేషన్ 2023 చైర్మన్ మనోజ్ టక్కర్ తనకు ఎక్జిక్యూటివ్ అసిస్టెంట్ గా విజయానంద్ ను నియమించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 59 మంది బాధితులకు 23లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం అని తెలిపారు. ధవాఖానాల లో ఉచితంగా రక్తం, మూత్ర ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారను. కంటి వెలుగు పథకం ద్వారా ప్రజలకి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ళ జోడు అందిస్తున్నామని చెప్పారు. నిజామాబాద్ నగర ప్రజలు అత్యవసర వేళల్లో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారు తమ కార్యాలయం లో సీఎంఆర్ఎఫ్‌కు బిల్లులతో దరఖాస్తు చేసుకున్నట్లయితే సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వనందుకు అధిక బిల్లు?

- లక్ష రూపాయలు లంచం ఇస్తే త్వరగా పనులు చేస్తామన్నారు
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు మాజీ ఎంపీపీ వినతి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యవసాయ బోర్ మోటార్ కోసం డీ డీ లు కట్టి ఇచ్చినా రాంగ్ ఎస్టిమేట్ వేసి 3,19,403 రూపాయలు కట్టాలని నోటీస్ అందజేసి డబ్బులు కట్టిన తర్వాతనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు రైతు, ధర్పల్లి మాజీ ఎంపిపి ఇమ్మడి గోపి తెలిపారు. లంచం ఇస్తే అంతా ఫ్రీగా చేస్తామని, ఇవ్వలేనందుకు అదనంగా బిల్లు వేశారని ఆరోపిస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ ఇందల్ వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి సబ్ ఇంజినీర్, ఇంచార్జీ ఏఈ పనులను చేయడానికి లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసినట్టు ఆరోపించారు. ఇవ్వనని చెప్పడంతో సరైన ఎస్టిమేట్ వేయకుండా ఇబ్బందులకు గురి చేశారని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఎస్టిమేట్‌తో 3,19,403 రూపాయల ఓఆర్సి కట్టించినట్లు తెలిపారు. ఇందల్ వాయి మండలంలోని డొంకల్ గ్రామ శివారులో తన భూమిలో విద్యుత్ సరఫరా కోసం ఎల్లారెడ్డిపల్లి సబ్ ఇంజనీర్, ఇంచార్జీ ఎఈకి 10 డీడీలు కట్టి విద్యుత్ సరఫరా ఇవ్వాలని 03 నవంబర్ 2022న దరఖాస్తు ఇచ్చినట్టు ఇమ్మడి గోపి వివరించారు. దరఖాస్తు ఇచ్చిన 5 రోజుల తరువాత సబ్ ఇంజనీర్ ఇంచార్జీ ఏఈ మూర్తి పొలం వద్దకు వచ్చి తనకు లక్ష రూపాయలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని, డబ్బులు ఇవ్వకుంటే పని తొందరగా కాదని చెప్పినట్లు అయన పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని, ఓఆర్సి డబ్బులు, కండక్టర్ వైరు, ఇతర సామాగ్రికి డబ్బులు తిరిగి ఇప్పించాలని కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నారు. పోస్ట్ ద్వారా విద్యుత్ శాఖ టీయస్ ఎన్పిడీసీఎల్ సిఎండి వరంగల్ కు ఫిర్యాదు కాపిని పంపించినట్లు ఇమ్మడి గోపి విలేకరులకు వివరించారు.

ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం మంగళవారం టీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయం వద్ద సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి ఆర్థిక సహాయం అందించి అండగా నిలబడ్డారన్నారు. తద్వారా పేదలు, మధ్య తరగతి వారికి వైద్యానికి ఎంతో భరోసా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, టౌన్ అధ్యక్షుడు చింత గణేష్, రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్. నాయకులు రేంజర్ల మహేందర్ , సైదు నర్సయ్య, సంత నడిపి రాజేశ్వర్, శ్రావణ్ కుమార్, జగన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ నేషనల్ డైరెక్ట్ కౌన్సిల్ మెంబెర్‌గా డాక్టర్ విశాల్



నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశవ్యాప్తంగా జరిగిన ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఎన్నికల్లో డైరెక్ట్ కౌన్సిల్ మెంబెర్‌గా గెలుపొందారు. జాతీయ ఎన్నికలలో 29 రాష్ట్రాల మానసిక వైద్యులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగిన ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ జాతీయ మహాసభలలో జాతీయ ఎన్నికల అధికారి డాక్టర్ అశోక్ రెడ్డి వెల్లడించారు. జాతీయ కార్యవర్గంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్ విశాల్ 2023 నుండీ 2026 వరకు- డైరెక్ట్-- కౌన్సిల్ మెంబెర్‌గా 1430 ఓట్ల తో విజయం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ తన గెలుపునకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర మానసిక వైద్యుల సంఘం వారికి ధన్యవాదాలు తెలిపారు. జాతీయ కార్యవర్గంలో తెలంగాణ రాష్ట్రంఏర్పడిన తర్వాత ఈ పదవిని చేపట్టినన మొదటి వ్యక్తిగా డాక్టర్ విశాల్ చోటు సంపాదించారు.

పశుమిత్ర నూతన జిల్లా కమిటీ ఎన్నిక



నూర్జహాన్



లక్ష్మీ



మౌనిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

పశుమిత్ర నూతన నిజామాబాద్ జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. పశు మిత్రల జిల్లా జనరల్ బాడీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యాలయం నిజామాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. ఈసమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ హాజరయ్యారు. అనంతరం 21 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఆఫీస్ బేరర్స్‌ను 11 మందితో ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా నూర్జహాన్, జిల్లా అధ్యక్షులుగా మౌనిక, జిల్లా ఉపాధ్యక్షులుగా వనిత, జ్యోతి, కవిత, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా మమత , సహాయ కార్యదర్శులుగా కార్తిక, దీప లక్ష్మీ స్వప్న వీరితోపాటు 10 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని స్థానిక బీటీఎస్ వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి ప్రయాణికులతో భిక్కనూర్ వెళ్తున్న ఆటో బీటీఎస్ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్, ప్రయాణికులు 8 మందికి గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

హుబ్బలి మార్కెట్‌ను సందర్శించిన మార్కెట్ కమిటీ



నవతెలంగాణ-సదాశివనగర్

మార్కెట్ కమిటీ బృందం కర్నాటకలోని హుబ్బలి మార్కెట్‌ను మంగళవారం సందర్శించినట్టు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పుల్గం సాయిరెడ్డి తెలిపారు. అక్కడి మార్కెట్ విధానం అక్కడ పండే పంటల అమ్మకాలు కొనుగోలును తెలుకున్నారు. స్టడీటూర్‌లో భాగంగా మంగళవారం సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలు ఆదాయం పెంచుకోవాలి

- ఏపీడీ మురళి కృష్ణ



మాట్లాడుతున్న ఏపీడీ మురళి కృష్ణ

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామ సంఘాలు ఆదాయం పెంచుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని ఏపీడీ మురళి కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇందిరాకాంతి పథకం కార్యాలయంలో ఆరు మండలాలకు చెందిన ఏటీఎంలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డీపీఎంలు రవీందర్‌రావు, రమేష్‌బాబు, వకుళ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ ఖండేరాయ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో నేటి నుంచి శ్రీ ఖండేయ ఆలయ ఉత్సవాలు నాలుగు రోజులపాటు జరుపుతున్నట్టు ఆలయ కమిటీ గ్రామస్తులు తెలిపారు. 8,9,10,11 తేదీల్లో పలు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సోమార్‌పేట్‌లో కంటి వెలుగు వైద్య శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ బత్తుల ఇందిరా అంజాగౌడ్ కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పార్దే నారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు సాయిలు, కమిటీ కార్యదర్శి బాల్‌వీర్, కిష్టయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాలబైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో స్వామివారికి సింధూర పూజలను మంగళవారం నిర్వహించారు. మూలబావి నుంచి నీరు తెచ్చి, ఆలయాన్ని శుభ్రపరిచి, భక్తుల ఓం భైరవ నామస్మరణతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసింది. ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మాలతి సంతోష్ గుప్తా, ఈవో ప్రభు, ఆలయ పూజారులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ, సిబ్బంది సురేందర్, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ భవనం ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో శ్రీకృష్ణ ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆశ్రమ భవనాన్ని ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పంచవతర్(కేస్ పూరి)కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జడ్పీటీసీ నర్సింలు, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ దామోదర్, రైతుబంధు అధ్యక్షుడు భూంరెడ్డి, పద్మజవాడి విండో అధ్యక్షుడు గంగాధర్, ఉత్తనూర్ ఎంపీటీసీలు రాంచందర్‌రావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సతీష్, నాయకులు రమేష్‌రావు, మోహన్‌రావు, చందర్ రావు, సాయగౌడ్, సుధాకర్, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో వ్యవసాయాధికారులు ముందుండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

రైతుల సమస్యలు పరిష్కరించడంలో వ్యవసాయ అధికారులు గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని ఎంపీపీ గాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సరపు క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ తునికి వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతురెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రామచంద్రం, రామేశ్వర్‌పల్లి సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాధా, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రజిత, వినోద్, అఖిలేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

- లంబాడీ సంఘం సాంస్కృతిక జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-జుక్కల్

సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కామారెడ్డి జిల్లా లంబాడీల ఐక్యవేదిక కల్చరల్ సెక్రెటరీ రాథోడ్ అనిల్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ తహసీల్దార్ గణేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అనిల్‌రాథోడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బంజారా లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకర విషయమే అయినా సెలవు ప్రకటించకపోవడం శోచనీయమని, సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కల్చరల్ కార్యదర్శి, యూత్ కోఆర్డినేటర్ సచిన్ నాయక్, రామ్ రావ్, పాండు, జేతాలాల్, ప్రకాష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, పేదలు

అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీలో పిలుపులో భాగంగా మున్సిపల్ ఆఫీస్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు బుధవారం ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని, ఇండ్ల స్థలం ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.ఐదు లక్షలు వెంటనే మంజూరు డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ కాలనీ నిర్మించాలని తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కాకపోతే రాబోవు రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు చేపడతామని స్పష్టంచేశారు. అనంతరం తహసీల్దార్ దీప్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందారపు రాజనర్సు, ఎమ్‌డీ మహబూబ్, కనకవ్వ, గంగవ్వ, విజయ్, రంజిత్, భరత్, నరసవ్వ అనిత, సుశీలమ్మ, వీరయ్య, దీవెన, శివరాజా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమం పట్టని బడ్జెట్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదని, బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కందారపు రాజనర్సు అన్నారు. బడ్జెట్‌పై మంగళవారం ఆయన మాట్లాడారు. కరోనా కాలంలో ప్రజల కోసం కార్మికులు తమ ప్రాణాలకు తెగించి ప్రజల ఆరోగ్యానికి భద్రత నిస్తూ పరిశుభ్రతా కార్యాక్రమాలు చేపట్టారని, అలాంటి కార్మికులను విస్మరించడం సరికాదని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా రూ.15 లక్షలు అమలు చేయాలని, దళిత కార్మికులందరికీ దళితబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి రైతు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-బోధన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రైతులకు కల్పిస్తున్న ప్రయోజనాలను ప్రతి రైతు వాటిని పొందడానికి తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాతో ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మంగళవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఆయన పోస్ట్ ఆఫీస్‌ను పరిశీలించి రైతులకు అందిస్తున్న సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఊట్పల్లి గ్రామాలలో రైతుల పంటలను పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ డబ్బులు 13వ విడత త్వరలో మంజూరవుతాయని తెలిపారు. దానికోసం ప్రతి రైతు బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచంచారు. రబీ సీజన్లో పంటల నమోదులో భాగంగా నమోదు చేసిన 20 సర్వే నంబర్లను ఆయన తనిఖీలు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టు పురుగు కొన్నిచోట్ల కనిపిస్తుందని, దీని నివారణకు ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి 8 కిలోలు చొప్పున వేయాలని, ఒకవేళ ఆకు చుట్టు పురుగు కనిపిస్తే కార్టప్ హైడ్రోక్లోరైడ్ 300 గ్రాములు 200 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసి నివారించవచ్చన్నారు. ప్రతి రైతు పీఎం కిసాన్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భనలో ఏఈఓ గంగాజల, బీపీఎం సునీల్ రైతులున్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-గాంధారి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని మాధవపల్లి గ్రామంలో శ్రీ హనుమాన్ మందిరం 6వ వార్షికోత్సవం సందర్భంగా హనుమాన్ ఆలయంలో నిర్వహించిన రాజా శ్యామల యజ్ఞం, పూజ కార్యక్రమాలలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధ బలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, మాజీ జడ్పీటీసీ తనాజీరావు, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సాయికుమార్, మాధవపల్లి సర్పంచ్ లక్ష్మీబాయి మహిపాల్ రావు, ఏఎంసీ మాజీ చైర్మెన్ సత్యం, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, నాయకులు తాడ్వాయి సంతోష్, బెజగం సంతోష్, ముకుంద్ రావు, శివాజీరావు, గ్రామస్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బాల్యవివాహాల కట్టడికి దృష్టిసారంచాలి

- ఎంపీపీ రజిని కిషోర్

నవతెలంగాణ-రెంజల్



మాట్లాడుతున్న ఎంపీపీ

బాల్య వివాహాల వలన శారీరక, మానసిక, రుగ్మతలు ఏర్పడే అవకాశం ఉందని, బాల్య వివాహాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ రజనీకిషోర్ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు స్థానిక ప్రజాప్రతినిధులను అనుసంధానం చేయాలని, ఐసీడీఎస్ అధికారులకు సహకరించాలని ఆమె అన్నారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జానకి, తహసీ ల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, ఎస్ఐ పండ్ల సయన్న, డాక్టర్ వినయ్‌కుమార్, హెచ్ఈఓ కలపే రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, బాలల సంరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

తపాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్

నవతెలంగాణ-జుక్కల్



మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

తపాల సేవలను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా తపాల శాఖ సీనియర్ సూపరిం టెండెంట్ ఉమామహేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తపాల కార్యాలయాన్ని సందర్శించారు. తపాల శాఖలో ఉన్న ఆర్డీ సెవింగ్స్ ఖాతాలు, సుకన్య సమృద్ధి యోజన పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఆర్పీఎల్ఐ, పీఎల్ఐ జీవిత బీమా పథకాలను అంగుబాటులో ఉన్నాయని తెలిపారు. తపాలశాఖలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌పైన అత్యధిక వడ్డీ రేట్లు ఉన్నాయని పేర్కొన్నారు. సందర్భనలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్పీఎం షకీల్, బీపీఎంలు బస్వారాజ్, భీంరావ్ తదితరులున్నారు.

ఆర్బీఐ పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్బీఐ పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్బీఐలో ఎన్నో రకాల పోటీ పరీక్షల నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయని, ఇవి తమ విద్యార్థులకు భవిష్యత్తును తీర్చిదిద్దేవిగా ఉంటాయన్నారు. బ్యాంకుల ద్వారానే కాకుండా పరిశ్రమల ద్వారా జాబ్ మేళాల ద్వారా విద్యార్థులు వ్యక్తిగత ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లకు అన్ని గ్రూపుల విద్యార్థులు సెలెక్ట్ అవుతున్నారని తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బ్యాంకుల, ఆర్బీఐ బ్యాంకుల ప్రాముఖ్యత ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాట్సాప్ నెంబర్ 9022690226కు 'హాయ్' అని టైప్ చేసి తమ ఖాతాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. తమ ఖాతాలకు వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపించి ఖాతా వివరాలను కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. ఇది వాట్సాప్ ద్వారా ఉచిత సేవ పొందుకోవచ్చని విద్యార్థులకు తెలిపారు. అనంతరం సెంటర్ ఫర్ ఫైనాన్స్ ఎల్లారెడ్డి ఆఫీస్ ఆర్బీఐ కౌన్సిలర్ మన్నె కృష్ణ, లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, బ్యాంకుల వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్‌పేలను ఉపయోగించకూడదని, వివిధ బ్యాంక్‌ల ద్వారా ఏర్పాటు చేసిన మనీ ట్రాన్సాక్షన్ యాప్‌ల ద్వారా మాత్రమే తమ ట్రాన్సాక్షన్ చేసుకోవాలని తెలిపారు. అయితే కొంతమంది ఫోన్ హ్యాకర్స్, డిజిటల్ హాకర్స్‌లలో జరుగుతున్న మోసాలను అరికట్టుట కొరకు తమ ఫోన్లకు వచ్చిన ప్రతి మెసేజ్లను లింక్‌లను క్లిక్ చేయకూడదని సూచించారు. తమకు వచ్చిన ప్రతి మెసేజ్లకు, ఫోన్‌కాల్స్‌కు ఏటీఎం పిన్‌నెంబర్, ఓటీపీ చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రభాకర్‌రావు, కృష్ణ ప్రసాద్, శశిధర్, చంద్రకాంత్, టీఎస్‌కేసీ మెంటర్ రాజు, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్



కొనసాగుతున్న రోడ్డు పనులు

డోంగ్లి మండలంలోని మల్లా పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం పనులను సర్పంచ్ ధర్మవ్వ గ్రామ కార్యదర్శి పద్మావతి గ్రామస్తులు కలిసి మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. నూతనంగా ఏర్పడిన మల్లాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్న సర్పంచ్ ధర్మవ్వకు గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టడం గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి జరుగుతుందని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పెద్దగుల్లాలో కంటి వెలుగు విజయవంతం

- ఆరోగ్య సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-జుక్కల్



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న పలువురు

మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం సర్పంచ్ రుక్మినిబాయి విఠల్ పటేల్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిందని జేపీఎస్ నందు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో యాదగిరి, వైద్యుడు విక్రమ్, సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటగా కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయడంలో కీలకంగా కృషి చేసినందుకు గాను అంగన్‌వాడీ టీచర్లకు, ఆశాలకు సర్పంచ్ రుక్మినిబాయి పటేల్ శాలువాతో వారిని సన్మానించారు. అనంతరం వైద్యుడు విక్రమ్ మాట్లాడుతూ.. కంటివెలుగును జనవరి 19 నుంచి ఫిబ్రవరి 6వరకు మొత్తం 1980 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 295 మందికి కండ్ల అద్దాలు పంపిణీ చేశామని వివరించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీ డీవో, ఎంపీవో, వైద్యుడు, విండో డైరెక్టర్ విఠల్ పటేల్ వైద్యసిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చిన్నగుల్లాలో..

కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్ శోభా ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ కంటి వెలుగు కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, జేపీఎస్ రమేష్, వైద్యుడు విక్రమ్, బీఆర్ఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుసమితి 2023 క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని గాంధారి రైతు వేదికలో రైతు బంధు సమితి 2023 క్యాలెండర్‌ను మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధ బలరాం, జెడ్పీటీసీ శంకర్‌నాయక్, గాంధారి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సాయికుమార్, ముద్దెల్లి సహకార సంఘం అధ్యక్షుడు సజ్జనపల్లి సాయిరాం, రైతు బంధు మండల సమితి అధ్యక్షుడు మనోహర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సత్యం, కరక్‌వాడి సర్పంచ్ వసంత చందర్‌రావు, గౌరరం సర్పంచ్ అంజయ్య, ముద్దెలి సర్పంచ్ కళావతి లక్ష్మన్, నాయకులు ముకుంద్‌రావు, శ్యామ్, గణేష్, మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏఈవోలు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని బురుగుపల్లి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని కంటి వెలుగు కార్యక్రమం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని తెలిపారు. సర్పంచ్ చంద్రవ్వ, ఎంపీటీసీ జనాభాయ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు గుండె రావు పటేల్, ఎంపీఓ సూర్యకాంత్, ప్రకాష్, పంచాయతీ సెక్రెటరీ సాయిలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు పరీక్షలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో కంటి వెలుగు పరీక్షలు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 1700 మందికి కంటి పరీక్షలు జరిపినట్టు కోఆర్డినేటర్ రాణి పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రోజుకు 200 మంది చొప్పున కంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోదిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ సాంప్రదాయ ఉత్సవాలైన వివిధ గ్రామ దేవతల జాతర ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని, ప్రభుత్వ విప్ తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ ప్రతినిధి గంప శశాంక్ సూచించారు. మండలంలోని కాచాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలలో మంగళవారం ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టగౌడ్ గంప శశాంక్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, సర్పంచ్ బైండ్ల సులోచన సుదర్శన్, ఉప సర్పంచ్ సాయబుగారి సిద్దగౌడ్, మండల కోఆప్షన్‌మెంబర్ ఎస్కే సుల్తానా, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు బుర్రి రంజిత్ వర్మ, ప్రజా ప్రతినిధులు, గౌడ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ-రెంజల్

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వాజిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండలంలోని సహకార వ్యవసాయ గిడ్డంగులను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. మండలంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని రైతుల ఆరోపణల మేరకు ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సొసైటీలు ఎరువులను అందుబాటులో నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట బోధన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సంతోష్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మి కాంత్‌రెడ్డి, సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అజయ్, ప్రసాద్ స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలను గడపగడపకు చేరవేయాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి
- నర్సాపూర్‌లో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ విధానాలను గడపగడపకు చేరవేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని మండలంలోని నర్సాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి మంగళవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంకెట రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నాయకులు ఇంటింటికి వెళ్లి రాహుల్ గాంధీ సందేశాన్ని, బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను కరపత్రాల రూపంలో ప్రజలకు ఇస్తూ హాత్ సే హాత్ జోడో స్టిక్కర్‌ను అందిస్తు గ్రామంలోని ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో భీంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొదిరే స్వామి, వేల్పూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, భీంగల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సయ్య, ప్రవీణ్ రెడ్డి, సంజీవ్ యాదవ్, బుచ్చి మల్లయ్య, ధర్పల్లి రాకేష్, బోనగిరి భాస్కర్, గణేష్, రమేష్ గౌడ్, కొమ్ముల రాజేందర్, ఉట్నూర్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్త బీసీ కులాలను ఓబీసీలో చేర్చాలని వినతి

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా బీసీ జాబితాలో చేర్చిన 17 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని సంఘం ప్రతినిధులు, రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌ను మంగళవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 17 కొత్త కులాలను బీసీ జాబితాలో చేర్చి రెండు సంవత్సరాలైనా ఓబీసీ జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చకపోవడం వలన కేంద్ర ప్రభుత్వ విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని అన్నారు. అలాగే సంచార జాతుల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన సీడ్ పథకంలోని కులాలలో సైతం 13 కులాలను చేర్చాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో డిఎన్టి డెవలప్మెంట్ బోర్డ్ మాజీ సభ్యులు తుర్క నర్సింహ, ఓబీసీ మోర్చా డిఎన్టి సెల్ రాష్ట్ర కో కన్వీనర్ పిల్లి సంజయ్ కిరణ్ మరి మోహన్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జెఈఈ మెయిన్స్‌లో ఆకాష్‌బైజూస్ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-నిజామాబాద్



నిజామాబాద్‌లోని ఆకాష్ బైజూస్ విద్యార్థి సిద్ధార్థ అన్నె ఇటీవల జరిగిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఈఈ) మెయిన్ 2023 తొలి సీజన్‌లో 99.75 పర్సంటైల్ సాధించినట్టు ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా తెలిపారు. సిద్ధార్థతో పాటు మరో ఐదుగురు విద్యార్థులు 95 పర్సంటైల్, అంతకుమించిన స్కోర్ సాధించినట్టు తెలిపారు. ఈ సంవత్సరం ఇంజినీరింగ్ కోసం నిర్వహించనున్న రెండు ఉమ్మడి ప్రవేశ పరీక్షలలో ఇది మొదటిదని తెలిపారు. అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షగా భావిస్తోన్న ఐఐటీ జెఈఈలో విజయం సాధించేందుకు సిద్ధార్థ.. ఆకాష్ బైజూస్ ఇనిస్టిట్యూట్‌లో చేరాడని, కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవడంలో తాము పడిన కష్టం, లెర్నింగ్ షెడ్యూల్స్‌కు అనుగుణంగా సిద్ధమవడంతో టాప్ పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ తనకు అన్ని విధాలుగా సహకరించిన ఆకాష్ ఇనిస్టిట్యూట్‌కు ధన్యవాదములు తెలిపారు. కంటెంట్, కోచింగ్ పరంగా వారి తోడ్పాటు ఉండటంతో తక్కువ సమయంలో విభిన్న బోధనాంశాలలో ఎన్నో కాన్సెప్ట్‌లలో మెరుగుపడ్డట్టు తెలిపాడు.

కాంగ్రెస్ సమావేశం

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ మండలాధ్యక్షులు అధ్యక్షతన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమ్మక్క సారలమ్మ దగ్గరనుంచి పాదయాత్ర ప్రారంభించారని దీనిపై సమావేశం నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, సీహెచ్ రాములు, కిసాన్ సేల్ అధ్యక్షులు సురేందర్‌గౌడ్, సాయిబాబాగౌడ్, అమ్రాది శేఖర్, జిల్లా కిసాన్ ఉపాధ్యక్షులు ఎమ్మెల్ రాజు, కృష్ణ, సోక్కుల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ అమీర్ కృషితో 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఎంపీపీ బుద్దే సావిత్రి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు గిర్ధవర్ గంగారెడ్డి, జీ శరత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీ.ఆర్.దేశాయ్, మాజీ రైతుబంధు మండల కోఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, టీఆర్ఎస్ బోధన్ మండలాధ్యక్షులు గోగినేని నరేంద్రబాబు, సర్పంచ్‌లు నాగయ్య, గంగాధర్, నానా పటేల్, మండల్ యూత్ అధ్యక్షులు గణేష్ పటేల్, నియోజకవర్గ యూత్ నాయకులు మేడి రవి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని పోస్టాఫీసు సమీపంలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి మేముసైతం ఫౌండేషన్ వ్యవస్థాపకులు నవీన్ నిత్యావసర వస్తువులను మంగళవారం అందజేశారు. నిరుపేదయైన సుజాత తన వృద్ధుడైన తండ్రిని, ఇద్దరు పిల్లలను పోషించడంలో ఇబ్బందులు పడుతుండడంతో మేము సైతం ఫౌండేషన్ వారు స్పందించి ఆ కుటుంబానికి 45 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ 47వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రేణుకా దేవి జమదగ్నిల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా కొనసాగింది. ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల గుండా డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోత్సవాల మధ్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ మహిళలే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారికి ఒడిబియ్యాన్ని, భక్తులు కట్న కానుకలు సమర్పించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది పెద్ద బచ్చాగారి రాంరెడ్డి కుటుంబ సభ్యులు, గౌడ సంఘ సభ్యులు సంయుక్తంగా పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘ అధ్యక్షుడు సిద్ధ గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లింగాల స్వామిగౌడ్, పట్టణ ప్రజా ప్రతినిధులు, గౌడ సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రమాబాయి జయంతి వేడుకలు

నవతెలంగాణ-రామారెడ్డి/కోటగిరి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 125వ జయంతి వేడుకలను మండలంలోని ఉప్పల్వాయిలో మాదిగ రాజకీయ పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు, రమాబాయి అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... భారత దేశానికి తన జీవితాన్ని ధారపోసి, ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న బీఆర్ అంబేద్కర్, ఆయన సతీమణి రమాబాయి అంబేద్కర్ సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు కొత్తొల్ల యాదగిరి, సర్పంచ్ కొత్తొల్ల గంగారం, రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ సరస్వతి, వీడీసీ చైర్మన్ ఆకుల లింగం, మాజీ వీడీసీ చైర్మన్ ఆల రామ్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సంకి శివరాజు, క్యాతం బాలరాజు, బత్తుల రాములు, పల్లె నర్సింలు, సంకి లింగం తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. మండల దళిత నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె దార్శనికత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మండల దళిత నాయకులు కాలే సాయిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాములు, జీవన్, సైదయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి : నివాళులర్పిస్తున్న పలువురు

మన ఊరు మనబడి పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కోటగిరి

మన ఊరు మనబడి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. మంగళవారం పోతంగల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. తక్షణమే త్వరితగతన పూర్తి చేయాలని డీఈ అంజిరెడ్డిని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు మూడు రోజుల్లో పూర్తి చేయాలని, లేనియెడల చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 40 లక్షల రూపాయలతో నిర్మాణం అవుతున్న మన ఊరు మనబడిలో భాగంగా జిల్లాకు ఆదర్శంగా మోడల్ పాఠశాల నిలవాలన్నారు ఆమె వెంట మండల విద్యాధికారి నాగనాథ్, ఏపీవో మారుతి, కొడంగల్ సర్పంచ్ శంకర్, షాదుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతన కలెక్టర్ సముదాయంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు మర్యాదపూర్వ కలిశారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటిఎస్ శ్రీనివాస్, కేసీఆర్ సేవాదళ్ సభ్యులు ఉన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన లలిత దేవి ఆలయంలో ఈనెల ఎనిమిదో తారీకు నుంచి 10 వరకు శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రామ అభివృద్ధి కమిటీతో పాటు యువకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పలుగుట్ట స్వామి మంగి రాములు మహారాజ్, మల్లారం పిట్ల కృష్ణ బాలమురళి మహారాజ్, చిలుకూరి శివాలయ ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారామ్ మహారాజ్, రాజేష్ సాంబశివరావు జోషి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

వడ్డెర వృత్తిదారుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు

నవతెలంగాణ-భిక్కనూర్

వడ్డెర వృత్తిదారుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఇందుకు నిదర్శనం రాష్ట్ర బడ్జెట్లో కేవలం మూడు కోట్ల రూపాయలు కేటాయించడం సిగ్గుచేటని వడ్డెర వృత్తిదారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర రాజు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో వడ్డెర వృత్తిదారుల సంఘ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షులు కొమ్మరాజుల శ్రీనివాస్, రాములు, ఐలయ్య ఆనంద్, అనిల్, స్వామి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఉమాకాంత్ మంగళవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించి గర్భిణులకు రక్త పరీక్షలు చేసి వారికి సలహాలను సూచనలను చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గర్భిణుల కోసం న్యూట్రీషన్ కిట్ ప్రవేశపెట్టి వారికి గర్భిణుల పౌష్టికాహారంతో అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాకాంత్, ఫార్మసిస్ట్ సంగమేశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ పండరి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆస్పత్రి సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంకెల్లో కాకుండా.. ప్రజల ఆకాంక్షలను తట్టాలి

- అర్థశాస్త్ర విభాగం చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పున్నయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బడ్జెట్ అంకెల్లో కాకుండా ప్రజల ఆకాంక్షలను తట్టినప్పుడే బడ్జెట్ ప్రక్రియ సార్థకం అవుతుందని అర్థశాస్త్ర విభాగం చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పున్నయ్య అన్నారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోస్టు బడ్జెట్ సింపోజియం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అయన పాల్గొని మాట్లాడారు. బడ్జెట్ ప్రక్రియ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కీలకంగా ప్రభావం చూపుతుందని పున్నయ్య పేర్కొన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు సమతుల్య స్థితిలో కేటాయించాలని, బడ్జెట్లో వృద్ధి, అభివృద్ధి, ప్రాథమిక లోటు, రెవెన్యూ లోటు లాంటి పదాల భావాలను వివరించారు. ఉత్తమ బడ్జెట్ ఎలా రూపొందించుకోవాలో విద్యార్థులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. ఆచరణ సాధ్యమైన కేటాయింపులు ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ సింపోసియంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ స్వప్న, డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ దత్త హరి, డాక్టర్ ప్రవీణ్ తో పాటు పరిశోధక విద్యార్థులు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలి

- దురుసుగా ప్రవర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలని, దురుసుగా ప్రవర్తిస్తున్న సినియర్ అసిస్టెంట్ నిరేదితపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ నిరేదితకు వినతి పత్రాన్ని స్వీకరించకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ నిరేదితకు అనేకసార్లు వినతి పత్రం అందజేయడానికి వచ్చిన దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందికరంగా మాట్లాడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రపు సాయ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో ఉపాధి హామీకి చట్టానికి నిధులు తగ్గించిందన్నారు. గ్రామాలలో సగటున సంవత్సరంలో 90 రోజుల కంటే ఎక్కువ పని దినాలు లేవని తెలిపారు. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, 600 రూపాయల రోజు వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వాసరి మోహన్, రాజేందర్, నాయకులు రాందాస్, సాగర్, సాయిలు, మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుదాం

- ప్రతి ఇంటికీ రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్దాం
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుదామని, ప్రతి ఇంటికీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్దామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రను మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఆర్టీసి బస్టాండ్ నుండి తిర్మన్ పల్లి గ్రామం వారకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మేడారం లో జోడో యాత్ర ప్రారంభించారని వివరించారు. రెండు నెలల పాటు ఈ పాదయాత్రలు కొనసాగుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేస్తున్నారని తెలిపారు. ఇందల్వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్యార్ నవీన్ గౌడ్, కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్, డిసిసి డెలిగేట్ సుధాకర్, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు గంగాధర్, లక్ష్మక్క, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ బైరయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ మత్స్య సెల్ కన్వీనర్ మార్వాడి పోశెట్టి మాట్లాడారు. బడ్జెట్లో మత్స్య కార్మికుల అభివృద్ధి కోసం 6000 కోట్ల రూపాయలు ప్రత్యేకంగా విడుదల చేయడాన్ని హర్షిస్తూ మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

బీజేపీ సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షులు వెంపల్లి శ్రీనివాస్ గౌడ్ అధ్యర్యంలో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ప్రతి రంగానికి నిరాశే మిగిలిందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు కిషన్ నాయక్. జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పు రాజేందర్,.సీనియర్ నాయకులు రమణ రెడ్డి, జగడం పోషన్న, ప్రధాన కార్యదర్శి కుంట శ్రీనివాస్, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాయితీ లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కాయితీ (మత్తురా) లంబాడాలను ఎస్టీ జాబితాలో కలపాలని పెద్దకొడపగల్ మండలంలోని వివిధ తండాలకు చెందిన వారు ఎమ్మెల్యే హన్మంత్‌షిండేను కోరారు. హైదరాబాద్‌లో షిండేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో కాయితీ లంబాడాలను ఎస్టీ జాబితాలో కలిపి రిజర్వేషన్ కల్పిస్తాని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర లబనా అధ్యక్షులు ఆదేశానుసారంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న కాయితీ లబనాలు తమ తమ నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యేలకు వినతిపత్రం ద్వారా తమ డిమాండ్ లు నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. షిండే సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మదన్ రావు, నానక్ సింగ్, మాజీ సర్పంచ్ బన్సీలాల్, జడ్పిటిసి చంద్రభాగ ఇంధల్, డా, గంగా సింగ్, నాయకులు బన్సీలాల్, చందర్, సజన్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఎంపీపీ బుద్దె సావిత్రి ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే షకీల్ అమేర్ సహకారంతో రాష్ట్ర 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20లక్షల నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. అలాగే జడ్పీటీసీ గిర్దావార్ లక్ష్మీ సహకారంతో మంజూరయిన జడ్పీ నిధులు రూ.2లక్షలతో బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్‌లు గిర్ధవర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, బుద్దె రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశాయి, సర్పంచ్ సిర్ప మంజుల, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సుదర్శన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

యాసంగి పంటలపై రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని ఆయా రైతు వేదికల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు యాసంగిలో సాగు చేస్తున్న పంటల యాజమాన్యంపై మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ముఖీద్, రాజాగౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్లో వరిపై కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు. దీని నివారణకు క్లోరోపైరీఫాస్ 250 ఎంఎల్ లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువులు దఫాదఫాలుగా వేసుకోవాలని, అధిక మొత్తంలో వాడకూడదని తెలిపారు. పీఎం కిసాన్ ఈ కేవైసీ చేసుకొని రైతులు తొందరగా చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం రైతుబంధు సమన్వయ సమితి క్యాలెండర్లను ప్రజా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, డైరెక్టర్ నారాయణ, తిమ్మారెడ్డి, వెళ్లుట్ల గ్రామాల సర్పంచులు మహమ్మద్ అలీ, గంట రాజేశ్వరి సాయిలు, ఆజామాబాద్ ఉపసర్పంచ్ పట్లోళ్ల కిష్టయ్య, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి కార్యవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు అనూహ్య స్పందన



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు హన్మండ్లు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెండో విడత కంటి వెలుగు పథకాన్ని అమలు చేయడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి పరీక్షలు చేసుకునేందుకు తరలివస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎడపల్లి ఆయుష్ వైద్య అధికారి వెంకటేష్, ఎంపీటీసీ సభ్యురాలు ఆరుగుల వనజ నాగరాజు, ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, లత, వసంత, గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, బిల్ కలెక్టర్ పద్మావతి, అంగన్వాడీ ఉపాధ్యాయులు బండ కళ్యాణి, అనురాధ, ఆశావర్కర్లు విజయ, కుంట అనిత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ప్రొఫెసర్ కాసిం దీక్షకు టీయూ పీడీఎస్‌యూ మద్దతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కాసిం చేస్తున్న నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో తెలంగాణ యూనివర్సిటీ కి కేటాయించిన 39కోట్ల నిధులు యూనివర్సిటీలో ఉన్న ఉద్యోగులకు జీతాలకే సరిపోతాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీ అభివృద్ధికి 200 కోట్లు నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలో నూతన బాలికల వసతిగృహం, ఆడిటోరియం నిర్మించాలని, స్పోర్ట్స్ కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ,ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు శివ సాయి, నాయకులు అశ్విత్, శేషు, మణికంఠ ,సాయి కృష్ణ పాల్గొన్నారు.